డయేరియాను అరికట్టడమే లక్ష్యం



దయేరియాతో చికిత్స పొందుతున్న వ్యాధిగ్రస్తులు



డయేరియాపై అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఆశ, ఏఎన్‌ఎంలు

- ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు
- అతిగా నీళ్ల విరేచనాలతో ముప్పు
- కాచి చల్లార్చిన నీళ్లే వ్యాధికి కళ్లెం

ఆకివీడు: డయేరియా.. అతిసార వ్యాధిగా కూడా పిలిచే ఈ వ్యాధి ప్రాణాంతకమైన జబ్బు కాదు. కాని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాల మీదకు వస్తుంది. అపరిశుభ్రమైన, కలుషితమైన నీటిని తాగడం వలన నిరంతరాయంగా నీళ్ల విరేచనాలతో బాధ పడుతుంటారు. మూడు సార్లు కంటే ఎక్కువగా వచ్చిన అతిసార వ్యాధిగ్రస్తులు వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆకివీడు ప్రాంతంలో నీటి కలుషితంతో ప్రతీ రోజూ సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు డయేరియా పేషెంట్లు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.

రెండు నెలలు ప్రత్యేక క్యాంపులు

స్టాప్ డయేరియాగా పిలిచే ఐడీసీఎఫ్ (ఇంటెన్సీఫైడ్ డయేరియా కంట్రోల్ పార్ట్‌నైట్) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం రెండు నెలల వ్యవధిలో నిర్వహించాలని ఆదేశించింది. ప్రతీ గ్రామంలో ఇంటింటికీ తిరిగి నీళ్ల విరోచనాలతో బాధపడే డయేరియా పేషెంట్లను గుర్తించాలి. ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య సమాచారాన్ని సేకరించాలి. అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లల్లోకి వెళ్లి విరేచనాలతో బాధపడే వారిని గుర్తించాలి.ఏఎన్‌ఎం, ఆశ వర్కర్‌లు సర్వేలో పాల్గొంటున్నారు. పిల్లలకు తల్లి పాలు అందజేస్తూ, అవసరమైతే ఓఆర్‌ఎస్ ప్యాకెట్లలోని పౌడర్‌ను నీళ్లలో కలిపి పట్టించాలని సూచిస్తున్నారు.

ప్రమాదకర సంఘటనలివే..

- రెండు, మూడు రోజులకన్నా ఎక్కువగా నీళ్ల విరోచనాలు అయితే మనిషిలో ఎలక్ట్రోలైట్స్ పూర్తిగా పడిపోతాయి.
- మనిషిలో నీరు పూర్తిగా పోయి నిర్జీవమై పోతాడు.
- ఉబ్బరం, వాంతులు అవ్వడం, పొత్తి కడుపు నొప్పి, శ్లేష్మంతో కూడిన మల విసర్జన వంటి జీర్ణకోశ ఇన్ఫెక్షన్‌లకు గురవుతారు.
- అలసట, జ్వరం, తలనొప్పితో డీ హైడ్రేషన్‌కు గురవుతారు.
- ఐదేళ్ల లోపు పిల్లల్లో వాంతులు విరోచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

దయేరియాకు తీసుకోవలసిన జాగ్రత్తలు

- కాచి చల్లార్చిన నీటిని త్రాగాలి.
- ఇళ్ల వద్ద నీటి ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేయించుకోవాలి.
- కుళాయి పైప్‌ల లీకేజీలను గుర్తించి, మురుగు నీరు చొచ్చుకుపోకుండా చూడాలి.
- ఫిల్టర్ నీటిలో ఓఆర్‌ఎస్ పొడి వేసుకునిత్రాగాలి.
- కలుషిత నీరు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ప్రతీ రోజూ జింక్ బిళ్లలను ఉదయం, సాయంత్రం నీళ్లలో కలుపుకొని తాగాలి.
- కుళాయిల ద్వారా సరఫరా చేసే నీటిని క్లోరినేషన్ చేయించాలి.
- కుళాయిలున్న ప్రదేశాల్లో మురుగు గుంతలుంటే బ్లీచింగ్ చల్లించి సూక్ష్మ క్రిములను నిర్మూలించాలి
- సీరియస్ కేసులైతే ఉన్నతాసుప్రతులకు తరలించాలి.

'నీటి'తోనే ప్రమాదం



డయేరియా వ్యాధిగ్రస్తులు నీళ్ల విరేచనాలతో బాధపడుతూ అధికంగా వస్తే ప్రమాదకరం. వెంటనే ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందాలి. కాచి చల్లార్చిన నీటిని త్రాగాలి. క్లోరినేషన్ చేసిన నీటిని, జింక్ బిళ్లలను ప్రతీ రోజూ వాడాలి. వర్షాకాలంలో అతిసారగా పిలిచే డయేరియా అధికంగా వస్తుంది. సీహెచ్‌సీలో ప్రతీ రోజూ ఇద్దరికి తగ్గకుండా పేషెంట్లకు వైద్యం అందిస్తున్నాం. గత నెలలో 17కు పైగా డయేరియా కేసులు నమోదు అయ్యాయి. – అజ్మీనా నజ్రీన్, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, ఆకివీడు

చిరస్మరణీయుడు అల్లూరి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వతంత్రం నా జన్మ హక్కని ఆచరణలో చూపిన వ్యక్తి అల్లూరి సదా చిరస్మరణీయుడని, అటువంటి మహనీయుల నుంచి స్ఫూర్తి పొందాలని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని సమయంలో స్వాతంత్ర్యంకోసం పోరాడిన ఎందరో పోరాట యోధులలో అల్లూరి ఒకరన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అల్లూరి తెగువ పోరాట పటిమ నుంచి యువత స్ఫూర్తి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. గత నాలుగు రోజులుగా 6 హైస్కూళ్లోని విద్యార్థులకు అల్లూరి జీవిత విశేషాలపై వ్యాస రచన, వక్తత్వ పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసాపత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, నడింపల్లి కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాద్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాసవీ లయన్స్ క్లబ్ సత్కారం



ఆర్‌ఎంపీ వైద్యుడిని సత్కరిస్తున్న దృశ్యం

కాళ్ల: వేంపాడు వాసవీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని కోపల్లె గ్రామ ఉప సర్పంచ్ బూడి వెంకట పరాలు తెలిపారు. వేంపాడు వాసవీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కోపల్లె గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉప సర్పంచ్ ఆర్‌ఎంపీ వైద్యులు బుడి వెంకట పరాలును సత్కరించారు. వైద్య వృత్తిలో ఆర్‌ఎంపీల సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ కందగట్ల మురళీకృష్ణ, సెక్రెటరీ మధుల నాగరాజు, ట్రెజరర్ నాలం గుప్తా, వాసవి క్లబ్ మెంబర్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నందమూరు గరువులో డ్రై డే నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: ప్రజల ఆరోగ్యం పట్ల, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని డీఎంహెచ్‌వో మహేశ్వరరావు తెలిపారు. వీరవాసరం మండలం నందమూరు గరువులో నిర్వహిస్తున్న డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా శుక్రవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీఒక్కరూ తమవంతు బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొబ్బరి డొక్కలు, ట్రాక్టర్ టైర్లు, రుబ్బు రోళ్లు, ఖాళీ సీసాలో నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య పద్ధతులపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో దేవదాసు, జి.జగమని, పి.చిట్టిబాబు, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరణలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

కాళ్ల: రాష్ట్ర విద్యాశాఖ సూచించిన ఫార్మాట్‌లో రూపొందించిన డైరీని మూడు సంవత్సరాలుగా అందిస్తున్న కాళ్ల మండల యూటీఎఫ్ శాఖకు గోపిమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యూటీఎఫ్ కార్యాలయం భీమవరంలో కాళ్ల మండల శాఖ ఆధ్వర్యంలో దివంగత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి జ్ఞాపకార్థం రూపొందించిన ఉపాధ్యాయ డైరీ ఆవిష్కరణ సభ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీఎస్ విజయరామరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. సీహెచ్ పట్టాభి రామయ్య, జి.రామకృష్ణంరాజు, బీఆర్ఎంకే స్వామి, ఎం.శంకర్రావు, బీబీ మణి పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 20వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో కూటమి నాయకులచే బాలింతలకు, గర్భిణులకు శుక్రవారం పౌష్టికాహారం అందజేశారు. బీజేపీ నాయకులు నరిశే సోమేశ్వరరావు, నాయకులు వర్తనపల్లి కాశీ, సోమరాజులు హాజరైయారు. ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోమశంకర్, నాగేంద్ర, శ్రీను, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: జ్వరం, కీళ్ల, కండరాల నొప్పులకు సొంత వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని టి.వేమవరంలో శుక్రవారం నిర్వహించిన మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా డ్రైడే ఫ్రైడేతోపాటు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహార పదార్థాలపై మూతలు ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ముఖ్యంగా దోమల వ్యాప్తి నివారణ ద్వారానే సకల రోగాలను నియంత్రించుకోవచ్చని తెలిపారు. వర్షాకాలం వచ్చే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలంటే జాగ్రత్తలు పాటించాలన్నారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

వీరవాసరం: ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ఈ నెల 10న దేశ వ్యాప్తంగా డిమాండ్స్ డే నిర్వహిస్తారని, అందులో భాగంగా వీరవాసరం మండలంలో కూడా నిరసన కార్యక్రమం నిర్వహించాలని సీఐటీయూ మండల కమిటీ నిర్ణయించింది. ఈ సందర్భంగా శుక్రవారం కరపత్రాన్ని విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై కాకుండా తన సొంత ప్రయోజనాల కోసం అధికారాన్ని వినియోగించుకొంటుందన్నారు. ఈ నేపథ్యంలో సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని విశాఖ ఉక్కును ప్రభుత్వమే నడపాలని, పలు డిమాండ్స్‌తో నిరసన చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు డి.వరలక్ష్మి, పి.నాగరత్నం, సత్యవతి మద్దాల శ్రీనివాస్, శాంత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న నూతనంగా ఏర్పడిన ఆకివీడు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కంభంపాటి నర్శింహం

ఆకివీడు: విద్య, ఆరోగ్యానికి ఆకివీడు లయన్స్ క్లబ్ అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని కమిటీ అధ్యక్షులు కంభంపాటి నర్శింహం చెప్పారు. స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ క్లబ్ 52వ అధ్యక్షుడిగా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 51 ఏళ్లుగా ఆకివీడులో లయన్స్ క్లబ్ సేవలందిస్తూ దినదినాభివృద్ధి చెందిందన్నారు. దాతల సహకారంతో శాశ్వత సేవా కట్టడాలను నిర్మించి, సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 120 మందికి పైగా క్లబ్ సభ్యులున్నారన్నారు. పట్టణంలోనూ, చుట్టుప్రక్కల గ్రామాల్లో కొత్త క్లబ్‌లను ఏర్పాటు చేసి, దాతల ధాతృత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఆకివీడు క్లబ్ కొత్త ఒరబడిని సృష్టించిందని చెప్పారు. ఈ నెల 7న ప్రమాణ స్వీకారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నూతనంగా ఏర్పడిన క్లబ్ కార్యదర్శి జీవీ సూర్యనారాయణరాజు, కోశాధికారి ఎంవీ సుబ్బరాజు, వేగేశ్న వెంకట కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం ఆర్వీ నారాయణ

ఆకివీడు: బాల్యంలో పిల్లల ఆహారం పట్ల తల్లులు జాగ్రత్తలు పాటించాలని, పౌష్టికాహారం అందజేసేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు ఆర్వీ నారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని అజ్జమూరు గరువు ఎంపీపీ పాఠశాలలో శుక్రవారం బాల్య సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆయన పలు సూచనలు చేశారు. 3–6 సంవత్సరాల లోపు పిల్లలకు ఆరోగ్యం, పోషణ, స్వేచ్ఛ, రక్షణ, విద్య, పౌష్టికాహారం అందజేయడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడాలి



తణుకులో ఇరిగేషన్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు అర్బన్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగు నీటి సరఫరా విషయంలో రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు నియోజకవర్గ ఇరిగేషన్ డిపార్టుమెంట్‌కు సంబంధించి కాలువలు, డ్రెయినేజీల అధికార యంత్రాంగంతో శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కాలువలు, డ్రెయిన్‌లలో పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కలను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలం కాలం సందర్భంగా రాబోయే వర్షాలను దృష్టిలో పెట్టుకుని కాలువగట్లను పటిష్టం చేయడంతో పాటు డ్రెయినేజీల ఇన్‌లెట్ తలుపుల మరమ్మతుల పనులను వెంటనే చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు డీ2 దక్షిణామూర్తి, ఈఈ కిషోర్, డీఈఈలు కె.శ్రీనివాస్, వరప్రసాద్, ఏఈలు అనిల్ బాలమురళి హరికృష్ణ, వివేక్ సత్యనారాయణ, జయశంకర్ పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య అధికారులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): ముందుస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేయవచ్చని మలేరియా యూనిట్ జిల్లా సహాయ అధికారి పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలన, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలపై అవగాహన, ర్యాలీ, సదస్సులు పట్టణంలో నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రజలు ఎటువంటి ఆందోళన, అపోవహలు వద్దని, అవగాహనతో వ్యవహరించాలని, అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, జ్వరాలు వచ్చినప్పుడు దగ్గరిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలని పలు సూచనలు చేశారు.

వైభవంగా గ్రామ దేవతల జాతర



జాతరలో గరగ నృత్యాలు నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: రాయకుదురు గ్రామ దేవతలైన శ్రీ మావుళ్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, పోతురాజుస్వామి ఆషాఢ మాస జాతర మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మేళ, తాళాలతో బాణసంచా కాల్పుల మధ్య గరగోత్సవం అత్యంత వేడుకగా చేపట్టారు. బుట్ట బొమ్మలు, తీన్మార్ నృత్యాలు, సినీ ఆర్కెస్ట్రాలతో జాతర కొనసాగింది. చలిమిడి, వడపప్పు, అన్నం, పానకాలతో మహా నైవేద్యం సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండవీటి రామచంద్రరావు, ప్రధానార్చకులు నాయుడు వెంకటేష్, ఏలూరి సూర్యనారాయణ పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అల్లూరి

భీమవరం (ప్రకాశంచౌక్): స్వతంత్రం నా జన్మ హక్కని ఆచరణలో చూపిన వ్యక్తి అల్లూరి సదా చిరస్మరణీయుడని, అటువంటి మహనీయుల నుంచి స్ఫూర్తి పొందాలని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు అన్నారు. గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు 127వ జయంతి వేడుకల ముగింపు కార్యక్రమాన్ని అల్లూరి కాంస్య విగ్రహం వద్ద నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత దేశానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని సమయంలో స్వాతంత్ర్యంకోసం పోరాడిన ఎందరో పోరాట యోధులలో అల్లూరి ఒకరన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అల్లూరి తెగువ పోరాట పటిమ నుంచి యువత స్ఫూర్తి స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. గత నాలుగు రోజులుగా 6 హైస్కూళ్లోని విద్యార్థులకు అల్లూరి జీవిత విశేషాలపై వ్యాస రచన, వక్తత్వ పోటీలను నిర్వహించామని, గెలుపొందిన వారికి బహుమతులు ప్రశంసాపత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పట్టణ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, నడింపల్లి కృష్ణంరాజు, ఇందుకూరి ప్రసాద్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ రహదారి పనులు త్వరితగతిన చేపట్టాలి

అత్తిలి: అత్తిలి నుంచి తణుకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో కె సముద్రపు గట్టు నుంచి గవర్లపాలెం వరకు రోడ్డు ఆధునికీకరణ పనులు త్వరితగతిన చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం కోసం గతంలో రోడ్డును జేసీబీతో తవ్వారని, దీనివల్ల ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి జారిపడుతున్నారు. వర్షాలు కురుస్తున్న సమయంలో ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించే వారు నానా అగచాట్లు పడుతున్నారని దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి రహదారి ఆధునికీకరణ పనులు చేపట్టాలని ఆయన కోరారు.

అలంపురంలో 115 మందికి ఉచిత వైద్యపరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణఛారిటీ ఉచిత ఆస్పత్రిలో శుక్రవారం 115 మంది రోగులు పరీక్షలు నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధి కృష్ణంరాజు తెలిపారు. జనరల్ వైద్యపరీక్షలు –46 మంది, ఫిజియోథెరఫీ–33, దంతపరీక్షలు–7, కంటిపరీక్షల చేయించుకొని నిడదవోలు ఆస్పత్రికి శస్త్రచికిత్సల కోసం మరో 25 మంది రిఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. శని, ఆదివారాల్లో ఆస్పత్రిలో ఉచిత కంటి పరీక్షలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ కంటివైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. ఆస్పత్రి ఆధ్వర్యంలో అవసరమైనవారికి రాయితీపై కళ్లజోళ్లు అందజేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రికెట్ అభిమానుల ర్యాలీ



క్రికెటర్లకు అభినందనలు తెలుపుతూ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): వెస్ట్ ఇండీస్‌లో జరిగిన టీ–20 క్రికెట్‌లో ప్రపంచ చాంపియన్‌గా విజయం సాధించిన భారత టీంపై హర్షాతిరేకాలు తెలియజేస్తూ శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ మాట్లాడుతూ 17 ఏళ్ల తరువాత టీ–20 వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత్ విజయం సాధించడం సంతోషదాయకమని, 2007లో ధోని సారథ్యంలోను, 2024లో రోహిత్ సారథ్యంలో విజయం సాధించామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలోనే ఎంతో ఉత్కంఠ భరితంగా సాగిన టీ–20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సౌత్ ఆఫ్రికాపై భారత్ ఘన విజయం సాధించింది. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ క్రికెట్ ప్రపంచ కప్‌లో భారత దేశానికి గర్వించదగ్గ గొప్ప విజయమని, మన భారత ప్లేయర్స్ కృషి అద్వితీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి కృష్ణ, బార్ చాంబర్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, కొండ్రు శ్రీనివాస్, ఏవో మావుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం మెటీరియల్ పంపిణీ



యూనిఫాం మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం తోట పోతురాజు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం మెటీరియల్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలోని 52 పాఠశాలల్లో 4,430 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు యూనిఫాం మెటీరియల్ అందజేశారు. అమ్మ ఒడి డబ్బులు ఎకౌంట్‌లో వేసే సందర్భంలో కుట్టుకూలి డబ్బులు కూడా జమ చేస్తారు. మండలంలోని అన్ని పాఠశాలలకు యూనిఫాంలు అందజేశామని, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వాటిని విద్యార్థులకు అందజేస్తున్నారని ఎంఈవో ఎ.రవీంద్ర చెప్పారు. కాగా శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తోట పోతురాజు, ఉపాధ్యాయులు విద్యార్థులకు యూనీఫాం మెటీరియల్ అందజేశారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: పరిసరాల పరిశుభ్రతతో దోమల వల్ల వచ్చే వ్యాధులను అరికట్టొచ్చని మండలంలోని పెదకాపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. కాళింగగూడెంలో శుక్రవారం డెంగీ ప్రబలకుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, మురుగు కుంతలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, ఖాళీ కొబ్బరి బొండాలలో దోమలు దాగి ఉంటాయన్నారు. వీటి వలన డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. వర్షాకాలంలో ఇటువంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలపునిచ్చారు. నీటి నిల్వలపై మూతలు వేయాలన్నారు. మురుగు గుంతలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం విజయలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

తణుకు టౌన్: తణుకు రోటరీ క్లబ్ 2024–25 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు సుధాకర్ చెప్పారు. శనివారం తణుకులోని రోటరీ హాల్‌లో జరిగే కార్యక్రమంలో రోటరీ నూతన అధ్యక్షుడు ఆనందం మస్తాన్‌రావు(బాబీ), కార్యదర్శిగా కఠారి సిద్ధార్థలు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.